క్లుప్తంగా

అరబుపాలెంలో రైస్‌కార్డుల పంపిణీ



రైస్ కార్డు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. అరబుపాలెం గ్రామంలో నూతనంగా మంజూరైన రైస్ కార్డులను ఆయన గురువారం అందజేశారు. ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంపద కేంద్రాలు అభివృద్ధి చెందాలి



సమావేశమైన ఈవోఆర్‌డీ చంద్రశేఖర్

పాయకరావుపేట : మండలంలో గల అన్ని గ్రామాల్లోను చెత్త నుంచి సంపద కేంద్రాలు అభివృద్ధి చెందాలని, అందుకోసం సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. సత్యవరం గ్రామంలో సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిషన్ అంత్యోదయపై దృష్టి సారించాలన్నారు. ఇంటి పన్నులు వసూలు చేయాలని, పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ సకిలేటి రాము, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మలాడలో సరుగుడు తోట దగ్ధం



కాలిపోతున్న సరుగుడు తోట

మునగపాక : మండలంలోని ఉమ్మలాడ గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలోని సరుగుడు తోట అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన పల్లె మురళీకృష్ణ, అప్పలనాయుడు సరుగుడు తోట సాగుచేస్తున్నారు. గురువారం సరుగుడు తోటకు మంటలు వ్యాపించి దగ్ధమైంది. సమాచారం తెలిసి అనకాపల్లి అగ్ని మాపక శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకునేందుకు ప్రయత్నించినా సరైన మార్గం లేకపోవడంతో పంట కాలిపోయింది. సుమారు రూ.3 లక్షల మేర ఆస్తినష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. కాగా ప్రమాదానికి కల కారణాలు తెలియరాలేదు.

దళిత గిరిజనుల సంక్షేమ సంఘ కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

మునగపాక : ఉమ్మలాడ కొబ్బరితోటలో గురువారం అఖిలభారత దళిత గిరిజనుల సంక్షేమ సంఘ జిల్లా నూతన కార్యవర్గం ఎంపికైంది. రాష్ట్ర అధ్యక్షునిగా కూకటపల్లి ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనకాపల్లి జిల్లా అధ్యక్షునిగా కంకణాల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో దళిత గిరిజనుల సంఘ నాయకుడు ఆంజనేయులు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు అడబాక సూరిబాబు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

రాంబిల్లి: దిమిలిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పౌర సరఫరాల శాఖ డీటీ రాజేశ్వరి గురువారం పరిశీలించారు. మిల్లర్లు అంగీకరిస్తేనే రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభు త్వం రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయమని చెప్పితే క్షేత్ర స్థాయిలో అధికారులు, మిల్లర్లు రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని రైతు లచ్చమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. వీఏఏ మేఘన పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- కాకివాని వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం



యలమంచిలి కాకివాని వీధిలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే యు.వి.రమణ మూర్తిరాజు (కన్నబాబురాజు) పేర్కొన్నారు. యలమంచిలి మున్సిపాలిటీ ఎస్సీ కాలనీ సచివాలయం పరిధి కాకివాని వీధిలో గురువారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి జగనన్న పరిపాలనలో లబ్ధిదారుల కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాల ద్వారా వారికి ఏవిధంగా ఉపయోగం కలిగిందని అడిగి తెలుసుకున్నారు. పేదలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. జగనన్న ప్రభుత్వానికి ప్రజలందరూ మద్దతు తెలుపుతున్నారని అన్నారు. అవినీతికి తావు లేకుండా నేరుగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఎందరో నిరుద్యోగులకు ఉపాధి కల్పించారని, విశాఖపట్నం పరిపాలనా రాజధానిగా చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి నిత్యశ్రామికుడిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని పేర్కొన్నారు. అర్హత ఉండి ఎవరైనా లబ్ధిదారులకు పథకాలు అందకపోతే వారికి తక్షణమే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఆదేశించారు. కాగా ఇటీవలే భర్త చనిపోయి ఎవరూ లేని ఇద్దరు పేద ఒంటరి మహిళలకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, వైస్‌చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ జెడ్పీటీసీ ఆడారి శ్రీధర్ (చిన్నా), మాజీ ఎంపీపీ యర్రయ్యదొర, కౌన్సిలర్లు చిరంజీవి, గొర్లె వెంకట్, పిట్టా సత్తిబాబు, దూది నరిసింహమూర్తి, కర్రి శివ, కొఠారు కొండబాబు, డాక్టర్ త్రినాథ్ పాల్గొన్నారు.

విద్యార్థుల చదువులో పురోగతి కనిపించాలి



నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

ఎస్.రాయవరం : ఉపాధ్యాయుల పురోగతి కనిపించాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ అన్నారు. ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాలను ఉపవిద్యాశాఖాధికారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నాడు నేడు పనులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం తీరును తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పాఠం బోధించిన తరువాత విద్యార్థులతో పూర్తి చేయించాల్సిన వర్కుబుక్ కరెక్షన్స్ పరిశీలించారు. లోపాలను గుర్తించిన ఉప విద్యాశాఖాధికారి ఉపాధ్యాయులకు హెచ్చరికలు జారీ చేశారు. వారం రోజుల్లో పని తీరు మారకుంటే సంబంధిత ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు తప్పవన్నారు. మండల విద్యాశాఖాధికారి ఎ.ఎస్.ఎస్.ఎస్ మూర్తి పాల్గొన్నారు.

కేంద్ర వైఖరికి నిరసనగా ఆందోళన

మునగపాక : రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు విమర్శించారు. గురువారం మునగపాకలో మెయిన్‌రోడ్డులో బ్లాక్ డే నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర విధానాలపై రాజీలేని పోరాటం చేయాలని సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో బ్రహ్మాజీ, మొల్లి సాంబమూర్తి, ఆడారి శ్రీరాముడు, శరగడం మహాలక్ష్మినాయుడు, దొడ్డి భాస్కరరావు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న నాయకులు, వైద్యులు

పాయకరావుపేట : మంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా గర్భిణులకు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ మురళీకృష్ణారెడ్డి, డాక్టర్ స్వరాజ్యంలు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. పెంటకోట గ్రామానికి చెందిన బొలిశెట్టి రాంబాబు పౌష్టికాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వంగలపూడి రామారావు, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ కోనే కొండలరావు పాల్గొన్నారు.

ఘనంగా తులసమ్మ తల్లి పండగ



తులసమ్మను దర్శించుకుంటున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక: మడకపాలెంలో గురువారం తులసమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నేతలు రాయి నాగేశ్వరరావు(బుజ్జి), నర్మాల రామకృష్ణ, యలమంచిలి సన్యాసినాయుడు,యలమంచిలి నూకరాజు, లగిశెట్టి బాబూరావు,ఉల్లింగల కుమార్‌రాజు, రాయి శ్రీను, అప్పలరాజు, వై.నూకరాజు, నాగేశ్వరరావు, ఎంపీటీసీలు ఈత బాబూరావు, రావి శోబన్‌బాబు తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న జనమిత్ర సంస్థ ఎండీ రమేష్‌బాబు

మునగపాక : మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని తిమ్మరాజుపేట జనమిత్ర స్వచ్ఛంద సంస్థ ఎండీ రమేష్‌బాబు కోరారు. సంస్థ ఆధ్వర్యంలో 90 మంది మహిళలకు పాల పదార్థాల తయారీపై శిక్షణ ఇస్తున్నారు. గురువారం మునగపాకలోని అమ్మ పాలకేంద్రానికి మహిళలను తీసుకువచ్చి పాల పదార్థాల తయారీ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. మహిళలు చిన్న కుటీర పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా ఆర్థిక ఆసరా పొందవచ్చన్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అమ్మ పాలకేంద్రం అధినేత సత్య, పీఆర్‌వో శ్రీనివాసరావు, జగ్గారావు, హరి పాల్గొన్నారు.

ఘనంగా ఉమా నాగ లింగేశ్వరస్వామి తీర్థం



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రాంబిల్లి : వెల్చూరులో గురువారం ఉమా నాగలింగేశ్వరస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కిల్లాడ మహాలక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిరిదళ్ల దేముళ్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు రంగనాయకులు



సమావేశంలో మట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రంగనాయకులు

యలమంచిలి : రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు అన్నారు. గురువారం యలమంచిలి మున్సిపల్ శానిటేషన్ గ్యారేజీ వద్ద అనకాపల్లి జిల్లా మున్సిపల్ వర్కర్స్ మొదటి మహాసభ జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కొత్తగా ఎఫ్ఆర్ఎస్ మస్టర్ విధానం రద్దు చేయాలని, కార్మికులకు ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని న్యాయస్థానం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వై.ఎస్ భద్రం, ఎస్.నర్సింహమూర్తి, వై.నూకరాజు సిహెచ్.వెంకటరమణ, డి.మహేష్, ఇ.చంద్రరావు పాల్గొన్నారు.

పల్లపు ఆనందపురం వివాదంపై నేడు విచారణ

మునగపాక : పల్లపు ఆనందపురంలో జరుగుతున్న వివాదానికి సంబంధించి శుక్రవారం అధికారుల విచారణ జరుగుతుందని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. కొంతకాలంగా ఎంపీటీసీ సంజీవిని, పంచాయతీ కార్యదర్శి సహీమ మధ్య వివాదం జరగడం, ఇటీవల ఈ విషయమై జేసీ కల్పనాకుమారి ఆరా తీయడం జరిగింది. డీపీవో శిరీషారాణి, జిల్లా పరిషత్ సీఈవో రామచంద్రమూర్తి విచారణ అధికారులుగా హాజరవుతారన్నారు.

ఆక్సాహేబుపేటలో డ్రోన్ సర్వే ప్రారంభం



ఆక్సాహేబుపేటలో ప్రారంభమైన డ్రోన్ సర్వే

కోటవురట్ల : ఆక్సాహేబుపేటలో జగనన్న సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఇందులో భాగంగా డ్రోన్ సర్వేను సిబ్బంది ప్రారంభించి రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దారు జానకమ్మ మాట్లాడుతూ సమగ్ర భూ రీ సర్వేతో భూ రికార్డులు సంపూర్ణంగా నమోదవుతాయన్నారు. అవకతవకలకు తావివ్వకుండా పక్కా రికార్డు ఉంటుందన్నారు.

సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ముందుగా సూచించిన రైతులు తమ భూములకు సంబంధించి రికార్డులతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అవుగడ్డి దుర్గా రాజీవ్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన అభయాంజనేయుని సంబరం

కోటవురట్ల : మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పరిసర గ్రామ ప్రజలు ఆంజనేయస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సతీమణి గుడివాడ హిమగౌరీ, తల్లి నాగమణి, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, డైరెక్టర్ శరగడం శంకరరావు, ఎంపీ సత్యవతి భర్త డాక్టర్ కె.విష్ణుమూర్తి తదితరులు తీర్థ మహోత్సవానికి హాజరై, స్వామిని దర్శించుకున్నారు. వీరికి డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, సర్పంచ్ మలసాల ధనమ్మ సాదర స్వాగతం పలికారు. తీర్థ మహోత్సవం పురస్కరించుకుని చింతలపాలెం, ఏనుగుతుని, ఏఎస్ పేట గ్రామాలకు చెందిన నాలుగు మహిళా బృందాలతో ప్రదర్శించిన కోలాటాలు ఆహూతుల్ని విశేషంగా అలరించాయి. అలాగే కాళికామాత, ఇతర శక్తి రూపాల్లో ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పిల్లలు రంగుల రాట్నంపై తిరుగాడారు. జారుడు బల్లలపై ఆటలాడారు. తీర్థంలో ఆట వస్తువులు, వంటింటి సామాన్లు, తిను బండారాల అమ్మకాలు జోరుగా సాగాయి. డాన్స్ బేబీ డాన్స్, రేలారే రేలా తదితర సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి ఉత్సాహంగా ప్రజలు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణతో రోడ్లు తళుకులీనాయి. భారీగా బాణసంచా కాల్చి, యువత సందడి చేశారు.

పాస్టర్స్ ఫెలోషిప్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక



నూతన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కోటవురట్ల : మండల పాస్టర్స్ ఫెలోషిప్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గం 2025 వరకు పనిచేస్తుందని పాలకవర్గ సభ్యులు తెలిపారు. దైవజనులు ఎస్.కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫెలోషిప్ హానరబుల్ ప్రెసిడెంట్‌గా జె.వి.ప్రసాద్, ఫెలోషిప్ ప్రెసిడెంట్‌గా రెవ ఎస్.కిషోర్ కుమార్, సెక్రటరీగా ఆశీర్వాదం, జాయింట్ సెక్రటరీగా విజయ్‌రాజు, ట్రెజరర్‌గా ఆర్.ఆనందరావు ఎన్నికై నట్టు తెలిపారు. అనంతరం పాలకవర్గ సభ్యులు ప్రార్థన నిర్వహించారు.

ప్రత్యేక ఆధార్ డ్రైవ్‌లను సద్వినియోగం చేసుకోవాలి



ప్రత్యేక ఆధార్ డ్రైవ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీడీవో మంజులా వాణి

అచ్యుతాపురం(అనకాపల్లి): ఆధార్ కార్డులో చేసుకోవాల్సిన మార్పులను ప్రత్యేక ఆధార్ శిబిరాల్లో చేయించుకోవాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి మంజులావాణి అన్నారు. అచ్యుతాపురంలో మండలంలో కైట్స్ విద్యా సంస్థల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ డ్రైవ్ కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వేలిముద్రలు, ఫోన్ నంబర్, చిరునామా మార్పు సవరించుకోవాలని ఆమె సూచించారు. కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ వినీత పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన



పోస్టల్ ఖాతా పథకాల గురించి వివరిస్తున్న ప్రసాద్

అచ్యుతాపురం (అనకాపల్లి): ఆడపిల్లల బంగారు భవిష్యత్ కోసం సుకన్య సమృద్ధి ఖాతా దోహదపడుతుందని అనకాపల్లి జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ జనపాల ప్రసాద్ బాబు అన్నారు. గురువారం ఆయన స్థానిక అచ్యుత ఇంగ్లిషు మీడియం పాఠశాలలో పోస్టల్ ఖాతా, పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పల్లె శేషగిరిరావు, హెచ్ఎం శ్రీనివాసరావు, దుప్పుతూరు పోస్ట్‌మాస్టర్ విశ్వేశ్వరరావు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలందిస్తే మంచి గుర్తింపు



మల్లికను సన్మానిస్తున్న ఎంపీడీవో కొండలరావు

రాంబిల్లి : మెరుగైన సేవలందించే ఉద్యోగులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు అన్నారు. కట్టుబోలు సచివాలయంలో గురువారం ఉత్తమ డిజిటల్ అవార్డు పొందిన కట్టుబోలు డిజిటల్ అసిస్టెంట్ మల్లికను ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రభుత్వం ప్రజలకు మెరుగైన , సౌకర్యవంతమైన సేవలందించడం జరుగుతుందన్నారు. సర్పంచ్ అగ్రహారపు ఆదిలక్ష్మి, వీఆర్వో జగన్నాథం, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు జి. రాజుబాబు, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలించిన ఎంపీడీవో



ఆధార్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి : విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ కోసం నక్కపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో సీతారామరాజు, వైస్ ఎంపీపీ వీసం నానాజీ పరిశీలించారు. ఆధార్ కార్డు పొంది పదేళ్లు దాటిన వారంతా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నక్కపల్లి కేజీబీవీలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. ఆధార్ కార్డు పొందిన విద్యార్థులకు ఇక్కడ బయోమెట్రిక్ , ఐరిస్ అప్‌డేట్ చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పాఠశాలల్లోనే ఈ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఈ సదుపాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెనూ ప్రకారం జగనన్న గోరుముద్ద

ఎస్.రాయవరం : ప్రభుత్వం కేటాయించాల్సిన మెనూ ప్రకారం విద్యార్థులకు జగనన్న గోరుముద్ద అందించాల్సిందేనని ఐకేపీ ఏపీఎం శివప్రసాద్ అన్నారు. ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాలను గురువారం ఐకేపీ సిబ్బంది, ఏపీఎం, సచివాలయ సిబ్బంది, గ్రామైక్య సంఘ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో వంటలను పరిశీలించి రుచి చూశారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో భోజన సదుపాయం ఏమాత్రం బాగా లేకున్నా సచివాలయంలో ఫిర్యాదు చేయవచ్చని విద్యార్థులకు వివరించారు.

లోవలక్ష్మి మృతికి సంతాపం



మృతిచెందిన సర్పంచ్‌కు శ్రద్ధాంజలి ఘటించి, మౌనం పాటిస్తున్న సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీ వెంకటలక్ష్మి

ఎస్.రాయవరం : ప్రజలకు సేవ కోసం ముందుకు వచ్చిన నేతల ఆశయాలకు అనుగుణంగా సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు నడుచుకోవాలని కొరుప్రోలు ఎంపీటీసీ కేసుబోయిన వెంకటలక్ష్మి అన్నారు. ఇటీవల ఆకాల మరణం చెందిన గ్రామ సర్పంచ్ పోలవరపు లోవలక్ష్మి మృతికి సంతాపం తెలిపి, కొరుప్రోలు రైతు భరోసా కేంద్రంలో సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు గురువారం రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సర్పంచ్ కొరపాటి గోపాలం, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి, సచివాలయ సిబ్బంది ,గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై లోకేష్ విమర్శలు హాస్యాస్పదం



వీసం రామకృష్ణ

నక్కపల్లి: భయం అనేది జగన్‌మోహన్ రెడ్డి బ్లడ్‌లోనే లేదని, అలాంటి మొనగాడికి భయం అంటే రుచి చూపిస్తానంటూ తెలుగు కూడా సరిగ్గా మాట్లాడడం రాని లోకేష్ హెచ్చరించడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిశీలకుడు వీసం రామకృష్ణ అన్నారు. వందేళ్ల చరిత్ర కలిగి, దేశాన్ని 40 ఏళ్లపాటు పాలించిన కాంగ్రెస్ పార్టీని ఎదిరించిన మొనగాడు జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. తన మాట వినలేదన్న కారణంగా అక్రమ కేసులు బనాయించి 16 నెలలు జైలులో పెట్టినా ఏ రోజుకూడా స్టేలు కోసం ఆశ్రయించకుండా ఎదురొడ్డి నిలిచి తన సచ్ఛీలతను నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్న వ్యక్తి జగన్ అని అన్నారు. ఒంటి చేత్తో పార్టీని స్థాపించి ఏ పార్టీతో పొత్తులేకుండా గత ఎన్నికల్లో 151 ఎమ్మెల్యే స్థానాలతో పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చిన నాయకుడు జగన్ అన్నారు. చంద్రబాబునాయుడు తనపై నమోదైన కేసులను ధైర్యంగా ఎదుర్కొనే సత్తా లేక స్టేలు తెచ్చుకుని కాలం గడుపుతున్నారన్నారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి రాత్రికి రాత్రే పెట్టేబేడా సర్దుకుని ఆంధ్రాకు పారిపోయి వచ్చిన చంద్రబాబును అడిగితే తెలుస్తుంది.. భయం అంటే ఏమిటో అని ఏద్దేవా చేశారు. లోకేష్ ముందు తప్పుల్లేకుండా తెలుగులో మాట్లాడడం నేర్చుకోవాలని హితవుపలికారు. ఉపన్యాసాల్లో లోకేష్ మాట్లాడే బండ బూతులు వినలేకే ప్రజలు పాదయాత్రకు రావడం లేదన్నారు. ఎమ్మెల్యేగా గెలవలేని నువ్వు కూడా సీఎంను విమర్శించడం విడ్డూరం అని లోకేష్‌ను ఉద్దేశించి అన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

యలమంచిలి : స్థానిక ఎస్సీ కాలనీ సచివాయం పరిధి ఇరిగేషన్ ఆఫీస్ వద్ద నుంచి ఎమ్మెల్యే కన్నబాబురాజు, మున్సిపల్ చైర్మన్ రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, కౌన్సిలర్లు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని తెలిపారు.